సుస్వాగతం

ఇద్దరు కుర్రవాళ్ళు విద్యార్థి దశలో ఎంతో అన్యోన్యంగా ఒకటే ప్రాణంగా ఉన్నప్పటికీ – ఉన్నంత మాత్రాన – తదనంతరం కూడా ఆ విధంగానే వుంటారని భావించనవసరం లేదు. వారట్లా ఉండాలని ప్రయత్నం చెయ్యటం కూడా ఒక్కొక్కసారి విరసానిక్కారణ మౌతుంది. ఇక అందులో ఒకడికోసం మరొకరు పన్నెండు గంటలు ప్రయాణంచేసి, మూడు రైళ్ళుమారి, చివర నాలుగైదు మైళ్ళు పది సంవత్సరాలనించీ మరమ్మతన్నమాట ఎరగని రోడ్డుమీద ఊగిసలాడే గుర్రబ్బండిలో ప్రయాణం చేసి సూర్యాస్తమయం అయేసరికి ఒక పల్లెటూరు చేరటమనేదుందే, నిద్ర నష్టం, శరీర కష్టం మొదలయిన వటుంచి, తిండికైతే నేం, ఏడు రూపాయల ఎనిమిదణాల తొమ్మిది పైసలు దండగ. సరిగా జోగారావు వంటి మనిషి చెయ్యవలసిన పనే! ఒక రకం మనిషి ఏ పని తలపెట్టినా చుక్క ఎదురవుతుంది. జోగారావా రకం మనిషి.

రాజమండ్రి వచ్చేవరకూ అతనికి ప్రయాణం నల్లేరు మీద బండినడక లాగే ఉంది. తరవాత కొంతకాలం వరకూ రైలెటు పోతున్నది, యిది ఏ దేశం, మనుష్యు లెట్లా ఉంటారు, ఊళ్ళెట్లా ఉంటై అనే ఆలోచనలు వచ్చినై; కాని ఏలూరు రాకమునుపే వాటిని గురించి ఆలోచనలు మానేశాడు. తెనాలిలో రైలు మారిన తరవాత అంతా ఒకటిగానే వుంది. బొందితో పరలోకానికి వెళ్ళితే ఇట్లాగే ఉంటుంది కదా అనుకున్నాడు.

అనుకోకుండా, అసందర్భంగా ఒక్క ఇల్లన్నా లేనిచోట అతని ప్రయాణమంత మయింది. బండివాడు దిగమన్నాడు. జోగారావుకిది చాలా అన్యాయంగా కనపడ్డది. ఇతర బళ్ళు కూడా అక్కడే ఆగి ఉండటం చూసి కొల్లూరు మునిసిపాలిటీవాళ్ళు బళ్ళను ఊరికి మైలు లోపలికి రానివ్వటం లేదేమోననుకున్నాడు. అతను బండివాడికి పక్కనున్న బయలు చూపించి “ఇదేనా కొల్లూరు?” అన్నాడు. అవునన్నాడు బండివాడు. అయితే బండి దిగనన్నాడు జోగారావు. దానిమీదట బండివాడు కొంతసేపు మొహాన ఆశ్చర్యరసం ఒప్పించి, తురకం తెలుగు కలగలుపుతో స్వగతం ఒకటి వినపడీ వినపడకుండా చెప్పి, చివరకు “మీ రెవరింటికి పోతారండీ?” అని అడిగాడు.

“డాక్టరు సుబ్రహ్మణ్యం గారింటికి” అన్నాడు జోగారావు.

"ఏది? కొత్త డాకటేరుగారింటికా?"

"నిస్సందేహంగా."

"గోపాలం గారబ్బాయిగారు?"

"అలాగే విన్నాను నే కూడా!" జోగారావు నిటూర్పు విడిచాడు.

"అంటే పొట్టి సుబ్బేరమన్నెంగారు కాదటండీ!"

"నే కాదన్నానా?"

బండివాడు తృప్తిపడి "పదండయితే" అన్నాడు. లక్షణం చూస్తే వాడికి తప్పింటికిపోవటం నామోషీగా కనపడ్డది.

కొల్లూరు మునిసిపాలిటీని తొందరపడి నిందించినందుకు జోగారావు నొచ్చుకున్నాడు. బండి యాభై గజాల దూరంపోయి ఆగింది. కాని తప్పు అంతా జోగారావుది కాదు. కొల్లూరు నడివీథి పొలిమేరలాగుండటం కొంతవరకు కొల్లూరు తప్పనే చెప్పాలిసుంటుంది. ఒక్క నిట్టూర్పు విడిచి జోగారావు తోలుపెట్టె తీసుకుని బండి దిగాడు. అతని కష్టాలు గట్టెక్కినై. భయాలు పరారయినై.

(నిజంగా కొల్లూరుందా? ఉంటే తనుపోతున్నది సరి అయిన మార్గమేనా? రైలు వాళ్ళు పొరపాటు పడలేదుకద? ఇదింకో కొల్లూరు కాదుకద? బండివాడికి దారి సరిగా తెలుసునా? అప్పుడే సాయంత్రం ఆరుగంటలయిందే? రాబోతున్న చీకట్లో తనగతేమవుతుంది. ఇది కొల్లూరు కాకపోతే? మొదలయిన భయాలన్నీ అంతరించినై. ఇది కొల్లూరు కావటమే కాకుండా ఈ కనపడుతున్న అరుగుల ఇల్లు సుబ్రహ్మణ్యంగారిది. ఇక దానియిష్టం వచ్చినపుడు రావచ్చునని జోగారావు చీకటి కనుజ్ఞ యిచ్చాడు.)

భయం పోగానే దాని స్థానంలో ఆశ్చర్యం వచ్చింది. సుబ్రహ్మణ్యం ఈ సంవత్సరంలో ఏమైనా మారాడా? తన్ను చూడగానే ఏమంటాడో? తన్ను మళ్ళీ త్వరగా పోనిస్తాడా? జోగారావు మొహాన ఒక విధమైన చిరునవ్వు మొలకెత్తింది. అతను కావాలని రెండు నిమిషాలాలస్యం చేశాడు తలుపు తట్టటానికి. లోపల సుబ్రహ్మణ్యం ఏం చేస్తుంటాడు? తనీరోజు వస్తాడని అతనికి తెలుసును. బండి చప్పుడువిని గ్రహించే ఉండాలి దొంగ! బయటికి రాడు!

చివరకు జోగారావు అరుగుల మధ్యనవున్న రెండు మెట్లు ఎక్కి మెల్లిగా తలుపుతట్టాడు. జవాబులేదు. మళ్ళీ తట్టి చెవులు రిక్కించి విన్నాడు. చడీ చప్పుడూ లేదు. కొంచెం గట్టిగా తట్టి "సుబ్రహ్మణ్యం!" అని పిలిచాడు. లోపల ఎక్కడో కొద్ది అలికిడి తరవాత కొద్దిసేపటికి "ఎవరు నాయనా?" – స్త్రీ కంఠం అతని తల్లేమో?

"సుబ్రహ్మణ్యం ఉన్నాడాండీ?"

"లేదు నాయనా!" ఈసారి మాట తలుపు వెనకనించి వచ్చింది. వెంటనే తలుపు తెరుచుకుంది. యాభై ఏళ్ళు దాటిన వితంతువు మొహం బయటికిపెట్టి అతన్ని చూసి సంబోధనమార్చి, "పొద్దునే వెల్లటూరు వెళ్ళాడండీ! ఈ పూటే వస్తాడో, రేపే వస్తాడో" అనుకుంటూ తలుపుమూసి వెళ్ళిపోయింది.

జోగారావు మొహాన చిరునవ్వు నిశ్శేషంగా మాయమైంది. దీని అర్థమేమిటి? తను రాసిన ఉత్తరం ఏమయింది? వాల్తేరునించి ఇచ్చిన తంతీ ఏమైంది? ఈ చీకటి అప్పుడే వచ్చిపడ్డదేం?

2

కొల్లూరు గ్రామస్తులు ఈ కష్టసమయంలో జోగారావు నాదుకోలేదా అని అనుమానం రావచ్చు. ఆదుకున్నారు. ఆ వితంతువు తలుపు మూసిపోయిన అయిదు నిమిషాలకు ఒక ముసలాయన నిర్మానుష్యమైన వీథివెంటపోతూ అతన్ని చూసి ఆగి "ఎవరది?" అన్నాడు. ఆ మనిషి కనపడేవరకూ కొల్లూరువాళ్ళు దీపాలు పెట్టిన తరవాత బయటికి రారేమో అని సందేహిస్తున్న జోగారావు ఆ ఊళ్ళో కనీసం ఒక్కడైనా ధైర్యస్తుడున్నందుకు సంతోషించి, ఆయన తనకేదైనా సహాయం చేస్తాడని, ఒక వాక్యంలో తన గద్య చెప్పిరెండోవాక్యంలో క్లుప్తంగా తన ప్రయాణాన్ని గురించి ప్రారంభించాడు. కాని ఎందువల్లో అతను మాట్లాడటం పూర్తికాక పూర్వమే ముసలాయన సాగిపోయినాడు. ఇంకో పడుచాయనా ఈ విధంగానే చేశాడు. జోగారావు ఇటువంటి అవమానాలు రెండుసార్లకుమించి భరించే స్వభావం కలవాడుకాడు. అందుచేత తరవాత తన్నాదుకో వచ్చిన వాళ్ళతో నోటికొచ్చిన అబద్ధాలన్నీ ఆడి సాగనంపాడు.

ఒక చెంపనించి నిస్పృహ అతని మనస్సునావరిస్తున్నది. ఆశలో నిరాశ, కాదు నిరాశలో ఆశను గురించి ఒక మహాకవి పాడనే పాడాడు. జోగారావు కూడా ఆ కారు మబ్బులోనుంచి వస్తున్న మెరుపును చూశాడు. తీరా ఇంకో గంటలో సుబ్రహ్మణ్యం రానే రావచ్చును. లేదా గుర్రబ్బండీ ఎక్కిపోతే స్టేషనూ దానిలో బెంచీ ఉండనే ఉంది రాత్రి గడపటానికి.

వీథి వెంట ఒక బండి మెల్లిగా రావటం మొదలుపెట్టింది. జోగారావా బండికి అడ్డం తగిలి ఒక అరగంట ఉండి రైలుకు బండి కడతావా అని అడిగాడు. బండివాడు రానన్నాడు. ఆ రోజుల్లో కొల్లూరు రోడ్డుమీద వేమూరు కొల్లూరు నవీన దొంగల సమాజం వాళ్ళు జోరుగా పని చేస్తున్నారు. జోగారావు నిస్పృహ పరిపూర్ణమైంది. కవిగాడు పప్పులో కాలేశాడనుకున్నాడు జోగారావు. కాని రవిగాననిచో కవిగాంచు నన్నవాళ్ళు పొరపాటు పడలేదు. ఆ కటిక చీకట్లో ఆ చుక్కల నల్లని కాంతిలో వీథి చివరగా ఒక తెల్లని ఆకారం

కనిపించింది. ఆ ఆకారం మెల్లిగా సమీపించి తనకు మూడు గజాల్లో ఆగేవరకూ ఆ మనిషి స్త్రీ అని జోగారావు గ్రహించలేదు. కేవలం స్త్రీ కూడా కాదు. పదమూడు పద్నాలుగేళ్ల పిల్ల! అమె అతనివంక ఒక క్షణం చూసి మెల్లిగా గడపమెట్లెక్కి తలుపు తెరిచి లోపలికి వెళ్ళింది.

లోపల మాటలు వినపడ్డై.

"ఏమిటే అమ్మాయి! అట్లా మీదికొస్తావు? నూతకం మయిలదానివి! మడి కట్టుకుని ఏడిస్తినికదా! మీ బస్తీ వేషాలూ మీరూనూ!"

తరవాత చిన్నగొంతు.

"అది కాదమ్మా! బయట కూర్చున్నదెవరే?"

"ఏమోనే? నే చూడలేదు. ముందవతలికి పోదూ, తల్లీ!"

"అందుక్కాదే ఇవాళ అన్నయ్యకు టెలిగ్రాం రాలా? ఆయనేమో?"

"............."

"కనుక్కోనా?"

"నీకెందుకు పోనీవే!"

కొంచెంసేపు నిశ్శబ్దం.

"కనుక్కుంటానే!"

"అట్లాగే? పోవే!"

"అయ్యో తల్లీ!"

లాంతరు తీసుకుని ఆ పిల్ల బయటికి వచ్చింది. జోగారావు గుండె దడదడ లాడటం మొదలుపెట్టింది.

"మీదేవూరండీ?"

జోగారావు చెప్పాడు.

"మీరేనా టెలిగ్రాం ఇచ్చింది?"

"అవును."

"లోపలికి రండి. మీ టెలిగ్రాం వచ్చినప్పుడు మా అన్నయ్య ఊళ్ళోలేడు. ఎవరిచేతనో చదివిస్తే సరిగా చదవలేదు. పాపం, మీరు వచ్చే సమయానికి ఊళ్ళో లేకుండా వెళ్ళాడు."

జోగారావు అరుగుమీదినించి పాతుకుపోయినట్లు మెల్లిగా లేచి చేతిపెట్టె తీసుకుని లోపలికి వెళ్ళాడు. ఆ పిల్ల దేవతలాగ రాకపోతే తనగతి ఏమైఉండును? అతనికింకా ముళ్ళమీద ఉన్నట్టే వుంది. సుబ్రహ్మణ్యం వస్తే కాని ఆ స్థితి అంతరించదు.

ఆ పిల్ల లోపలికివెళ్ళి తల్లితో చెప్పింది. ఆవిడ ఒక చెంబుతో నీళ్ళిచ్చి, "కాళ్ళు కడుక్కొని చాపేసుక్కూర్చో. నాయనా?" అంది, మళ్ళీ సంబోధన మార్చి.

అతను చాపవేసుకుని కూర్చున్నాడు. ఆ పిల్ల వెళ్ళి వంట ఇంట్లోనే ఒదిగింది. తల్లీ కూతుళ్ళు ఏదో చిన్నగొంతుతో మాట్లాడటం మొదలుపెట్టారు. అతనికి ప్రతిమాటా వినపడుతున్నది. కొంతసేపయిన తరవాత అతనికి చిత్రమయిన ఆలోచన వచ్చింది. అతనాపిల్లను చూసి కొద్ది నిమిషాలయిందో లేదో అప్పుడే ఆమెను గురించి ఎంత తెలుసును!

ఆమె పేరు జానకి. సుబ్రహ్మణ్యం చెల్లెలు. వితంతువు. మొగుడుపోయి అప్పుడే నాలుగేళ్ళయింది. పెళ్ళయి ఎంతకాలమయిందో? తెలివికలది. నేర్పరి. కొంతకాలం బస్తీలో పెరిగింది. "జానకి వదనంబు చంద్రబింబంబు" అనుకున్నాడు జోగారావు. అతని కకస్మాత్తుగా కవిత్వం అబ్బింది.

3

"మడిగట్టుకో, నాయనా, వంటయింది" అన్నది ముసలావిడ.

తలుపు తెరుచుకుని సుబ్రహ్మణ్యం ప్రవేశించాడు. జోగారావు కొంటెతనానికి ఉలక్కుండా పలక్కుండా కూర్చున్నాడు.

సుబ్రహ్మణ్యం స్నేహితుణ్ణి చూసి ఎక్కువ సంతోషం కనపరచలేదు.

"ఎప్పుడొచ్చావు?" ఆ ప్రశ్నలో ఎందుకొచ్చావన్న ధ్వని వినపడ్డది జోగారావుకు.

"ఒక గంటయింది" అన్నాడు జోగారావు. అతను స్నేహితుడి ప్రశ్నలో ఉన్న ధ్వనికి కూడా సమాధానం ఇచ్చాడు. అబద్ధం మాత్రం ఆడాడు. "బెజవాడలో మా బంధువులున్నారు. అంతదాకా వచ్చినప్పుడు నిన్ను కూడా చూడాలనిపించింది." (జోగారావు బెజవాడలో దిగలేదు)

సుబ్రహ్మణ్యం మొహం కొంచెం తెరిపిచ్చింది.

"రెండురోజులుంటావా?" (ఎపుడు పోతావని ధ్వని.)

"ఉండను. రేపు సాయంకాలమయినా పోకతప్పదు."

సుబ్రహ్మణ్యం మొహం మరింత తెరిపిచ్చింది.

"అబ్బాయి! వంటయింది లేవండి" అంది తల్లి లోపలినించి.

భోజనం చేస్తూ జోగారావు "నా ఉత్తరం అందిందా?" అన్నాడు.

"ఏం ఉత్తరం? అందలేదోయి!"

"దాన్లో నేనిలా రాబోతానని రాశాను. అందుకేమో! ఈ ఊరికి ఉత్తరం చేరకపోయినా నాకాశ్చర్యంగా ఉండదు సుమీ. టైముకు మాత్రం ఊళ్ళో లేకుండా పోయావు." సావిట్లోనించి సంభాషణ అంతా వింటున్న జానకి జోగారావును చూసి జాలిపడ్డది. జోగారావు రాసిన ఉత్తరం రావటం సుబ్రహ్మణ్యం విసుక్కోవటం జానకి అప్పుడే మరవలేదు.

భోజనాలయిన తరవాత స్నేహితులిద్దరూ చల్లగాలికి వాకిట్లో అరుగుమీద

కూర్చున్నారు. కొంతసేపు ఎవరిలోకంలో వారున్నారు. జోగారావు లోపల తల్లీ కూతుళ్ళకు జరుగుతున్న సంభాషణ వింటున్నాడు.

"అన్నానికి రావే అమ్మాయి" అంటున్నది తల్లి.

"నీ ప్రాక్టీసెట్లా ఉంది?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అలా అలా ఉంది!...."

"నాకు ఆకలవుతున్నదే!" అంటున్నది జానకి.

"నేను రమ్మంటూనే ఉంటినిగాదుటే?"

"నీకేంలే! మీ నాన్నగారి ప్రాక్టీసంతా నీదేగా? నాబోటివాడికి...."

ఇంతలో జానకిమాట చెవిన పడేటప్పటికి సుబ్రహ్మణ్యం అంటున్నది వినటం మానేశాడు జోగారావు.

"ఎక్కడో మైలుదూరం వెళ్ళి విస్తరి పారెయ్యాలమ్మా. అక్కడ పాములు–"

"మీ నాన్నగారి ప్రాక్టీసెట్లా ఉంది?"

"బాగానే ఉంది."

"అంత ఒళ్ళు బరువేమే!" తల్లి.

"పాములే! పోనీ ఈ మూలపెట్టి రేప్పొద్దున..." జానకి.

"ఈ పల్లెటూళ్ళో ఏం డబ్బొస్తుంది? బస్తీ చేరతాను" జోగారావు విసుక్కునే మనిషి కాదు. కాని సుబ్రహ్మణ్యం కాస్సేపు కట్టిపెడితే బాగుండుననిపించింది అతనికి.

"చాల్చాల్లే నేర్చుకు పోతున్నావు. నేనీపూట ఇల్లు కడుక్కోవద్దా ఏమిటి?" తల్లి.

"పోనీ నాకంత ఆకలిగా లేదు" జానకి.

"అసలదీ ఉన్న సంగతి. ఆ వైద్యుడేమ్మందిస్తున్నాడో చరచరా ఆకలే లేదు. తింటావా? నన్ను కూర్చోమన్నావా?"

"నువు కూర్చో!"

"ఒక్క పేగు మాడనీ!"

జోగారావు పరధ్యానంగా ఉండటం గమనించాడు సుబ్రహ్మణ్యం.

"చంద్రోదయం అయింది. కాలవలవైపు పోదాం రావోయి. చాలా బాగుంటుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం. జోగారావు మాట్టాడకుండా లేచాడు.

జోగారావుకు కొల్లూరు రావటం నిరుత్సాహకరమైంది. అయినా దీనిలో కూడా ఒకటి రెండు విశేషాలు లేకపోలేదు. మొదటిది జానకి. రెండోది కాలవలు. అంతకుపూర్వం జోగారావు కాలవలు చూడలేదు. కొన్ని వందలసార్లు సముద్రం మీద చంద్రోదయం

చూసినవాడికి కాలవలు ఆశ్చర్యం కలిగించటం చిత్రమేకాని అసంభవం కాదు. మొదటినించీ చదువుకున్న పట్టణవాసపు ఆడపిల్లల మధ్య తిరిగినవాడికి పల్లెటూరి వితంతువును చూడగానే గుండె ఎగిరిపడటం కూడా అటువంటిదే.

ఇద్దరూ ఇల్లు చేరేటప్పటికి పదకొండు గంటలయింది. జానకి ఒకమూల చాపమీద పడుకొని నిద్రపోతున్నది. అన్నం లేకుండా? పల్లెటూరి వాళ్ళెంత క్రూరంగా వుంటారు పిల్లల విషయంలో కూడా! జానకి చాపకు ఇవతలగా మంచం వేసుకున్నాడు సుబ్రహ్మణ్యం. అతని పక్కన జోగారావు మరో మంచం మీద పడుకున్నాడు.

జోగారావు చాలాసేపు మంచి నిద్రపోయినాడు. కాని తెల్లవారుఝామున అతనికి కల వచ్చింది. ఆ కల్లో జానకీ, తనూ కలిసి చదువుకున్నారు. తనేమో అచ్చంగా జానకి మొగడల్లే వున్న ఒక పెద్దమనిషికి రెండోపెళ్ళి చెయ్యాలని ప్రయత్నం చేస్తుండగా ముసలావిడ వచ్చి "అమ్మాయి! అమ్మాయి! నేను కాలవకు పోతున్నా తలుపేసుకోవే" అంటోంది. జోగారావుకు మెళకువ వచ్చింది. అతని కళ్ళు తెరిచేటప్పటికి అంతా ప్రశాంతంగా వుంది. ముసలావిడ జానకి తన కేక విన్నది లేందీ గమనించకుండా కాలువకు బయలుదేరి పోయింది. సుబ్రహ్మణ్యం జానకీ నిద్రపోతున్నారు. జోగారావు జానకి వంక నిర్ఘాంతపోయి చూశాడు. అదేం నిద్ర? జోగారావు కళ్ళకు జానకి నిద్రపోతున్న మనిషల్లే లేదు. చాలాసేపు బాధపడి చివరికెట్లాగో నివారణ అయినట్టుంది. ఆఖరు నిద్రేమో? రాత్రి జానకి అన్నం తినలేదు. శోష వచ్చిందేమో? ఆమె వంక అతను అయిదు నిమిషాలు నిదానించి చూశాడు. ఏమీ చలనం లేదు. ఊపిరి పీలుస్తున్న లక్షణాలైనా లేవు. జోగారావు కంగారుపడటం మొదలుపెట్టాడు. నాలుగు చుక్కలు గొంతులో నీళ్ళయినా పోస్తే – తనిప్పుడేం చేయాలి? దీపం పెద్దది చేస్తే జానకిని బాగా చూడవచ్చును. కాని వెల్తురుకు సుబ్రహ్మణ్యం ప్రశ్నలు వేస్తే సమాధానం చెప్పటం కష్టం. ఇంతకూ ఆ పిల్ల జీవించి ఉన్నదీ లేనిదీ చూడటం ఎట్లా?

జోగారావు మెల్లిగా పక్కదిగి జానకివైపు రెండడుగులు వేసి దబదబా తిరిగివచ్చి పక్కమీద గాఢనిద్రలో ఉన్నట్టు పడుకున్నాడు. అంత భయం వేసింది. ముచ్చెమటలు పోసినై. సూర్యుణ్ని సమీపించబోయిన సంపాతి కథయింది. ఎందుకంత భయం? మూడు నిమిషాలుండి జోగారావు మళ్ళీ లేచాడు. ఎంతో కష్టం మీద జానకిని సమీపించాడు. అతని గుండెలు కొట్టుకోటం పద్ధతి చూస్తే వాటి బతుకు నిమిషాలమీద ఉన్నట్టు కనపడ్డది. అయినాసరే! మెల్లిగా వంగి జానకి ముక్కు దగ్గిర చెయి పెట్టాడు. అమ్మయ్య! ఊపిరాడుతూనే ఉంది. ఫరవాలేదు.

"జోగారావు!"

"జోగారావదిరిపడి లేచినిలుచుని వెనక్కు తిరిగి చూశాడు. సుబ్రహ్మణ్యం పక్కమీద శిలావిగ్రహమల్లే లేచి కూర్చుని ఉన్నాడు.

"ఏమిటో యది?"

జోగారావు మాట్లాడలేదు. ఏముంది మాట్లాడటానికి? నీ చెల్లెలు జీవించి ఉందో లేదో చూస్తున్నాననటం కన్నా అనేకరెట్లు అనకపోవటమే మంచిది.

జోగారావు మౌనం సుబ్రహ్మణ్యానికి గట్టిగా మాట్లాడటానికవకాశమిచ్చింది. సుబ్రహ్మణ్యం మాట్లాడాడు కూడాను. ఉపన్యాసం చదువుకున్న అజ్ఞానులతో ప్రారంభమై, ఇంట తిని ఇంటి వాసాలు లెక్కపెట్టడం దగ్గిర తారట్లాడి, బ్రహ్మాండమైన నీతిలో కొట్టుకొని కాస్సేపు ఈదులాడి, జోగారావు యిష్టం వచ్చినప్పుడు వచ్చిన దారి పట్టగలందులకు పాస్‌పోర్ట్‌తో అంతమయింది.

ఈ అల్లరితో జానకి లేచి కూర్చున్నది.

సుబ్రహ్మణ్యం వికారంగా నవ్వుతూ "ఏమే అమ్మాయి, నిన్నీ దొరగారు తాకాడా? ఎందుకంటే, దాని మంచి చెడ్డా అట్లా వుంచి, వారు మైల పడ్డందుకు స్నానం చెయ్యవలసి ఉంటుంది!" అన్నాడు.

జానకి చప్పున కథ పట్టు అందుకోలేక పోయింది. ఆమె కోసం తను పావుగంటనించీ దొంగనిద్ర పోతూ గమనించిందంతా సుబ్రహ్మణ్యం చెప్పుకొచ్చాడు. జానకి నిర్ఘాంతపోయి నిజమేనా అన్నట్టు జోగారావు వంక చూసింది.

సుబ్రహ్మణ్యం కోసం జోగారావు నోరు చేసుకోదలచక పోయినా జానకి కోసం నిజం చెప్పేశాడు. ఆమె నవ్వినా సరేనని.

"నమ్ముతావా?" అన్నాడు జోగారావు సుబ్రహ్మణ్యంతో.

సుబ్రహ్మణ్యం ఒక్క క్షణం కలవరపడి, "అయితే నువ్వు రాత్రి భోంచెయ్యలేదా?" అన్నాడు చెల్లెలితో.

"చేశాను..."

చెల్లెలికడ్డం వచ్చి సుబ్రహ్మణ్యం మాట్లాడబోయినాడు. కాని జానకి అతనికా అవకాశం యివ్వకుండానే జోగారావు వైపు తిరిగి "మీ మాట నేను నమ్మాను. మీరు నాకు చూపించిన దయ – జాలి – మరవను. కాని మీకిది ఉండదగిన చోటు కాదు. మా అన్నయ్యకు మీరు రాసిన ఉత్తరం అందింది. అదీకాక నిన్న మా అన్నయ్య ఊరికి పోవటానిక్కూడా కారణం ఏమీలేదు. మీరు వస్తారేమోనన్న భయం తప్పితే. ఆయన అవస్థ చూసి మీరిట్లా ఉంటారని – ఇంకో విధమైన మనిషేమోనని కూడా అనుకున్నాను. వెంటనే వెళ్ళిపోండి" అన్నది.

రైలులో జోగారావు మనస్సులో పెద్ద సంఘర్షణ పెట్టుకున్నాడు.

"నాకా జానకి కావాలి" అన్నాడు జోగారావు.

తీర్పు మనస్సు చేతుల్లోనే ఉంది.

"ఓరి జోగులూ! మెరుపు మెరిసి పోవలసిందే! ఆకాశాన అట్టే ఉండమంటే ఎలా ఉంటుంది?" అన్నది మనస్సు నిర్దయగా.

మొదటి ముద్రణ : ప్రబుద్ధాంధ్ర, జనవరి 1934